విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108. E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :98 నల్గొండ | గురువారం 03-07-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-


## మరోమారు పాశమైలారానికి మంత్రి దామోదర



సంగారెడ్డి,జులై2: సిగాచి పరిశ్రమ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహను బాధితులు నిలదీసారు. ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుధవారం ఉదయం ఘటనా స్థలికి చేరుకున్నారు. మంత్రి వెంట తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, జగ్గారెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ప్రమాద స్థలిని వారు పరిశీలించారు. అయితే అధికారుల ముందు బాధితుల బంధువులు ఆందోళనకు దిగారు. మంత్రి దామోదరతో బాధితులు వాగ్వాదానికి దిగారు. మూడు రోజులైనా తమ వారి ఆచూకీ చెప్పడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చర్యలు చేపడతామంటూ బాధితులను మంత్రి దామోదర రాజనర్సింహ సముదాయించారు.అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సిగాచి ప్రమాద ఘటనలో ఇప్పటి వరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని.. 13 మంది మిస్సింగ్‌లో ఉన్నారని తెలిపారు. 11 మంది మృతదేహాలను అప్పగించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను వాళ్ళ కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అన్నారు. ప్రతిపక్షాలు దీన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని స్పష్టం చేశారు. కంపెనీ యజమాని అందుబాటులోకి వచ్చారని.. ఇప్పటికే కంపెనీపై కేసు నమోదు చేయించామన్నారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 11 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందని మంత్రి దామోదర వెల్లడించారు. ఈ ఘటనను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ సీరియస్‌గా తీసుకున్నారని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందని.. కంపెనీ నుంచి కూడా బాధితులకు నష్టపరిహారం అందజేసేలా చూస్తామని అన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే కమిటీ వేశామని మీనాక్షి తెలియజేశారు.ముఖ్యమంత్రి , మంత్రులు ఈ ఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. మృతదేహాలను ప్రత్యేకంగా ఫ్రీజర్లలో మార్చురీలో భద్రపరిచామన్నారు. గాయపడిన వారికి కంపెనీ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమలో మూడోరోజు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారీ క్రేన్లు, జేసీబీలతో శిథిలాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. అయితే తమ వారి ఆచూకీ తెలియడంలేదంటూ ఘటనా స్థలిలో బంధువుల ఆందోళనకు దిగారు.

## ఏఐజీ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఏడాదిలో ఏదో ఒక్క నెల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేయండని వైద్యులకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో ఉండే వైద్యులు కూడా అప్పుడప్పుడు హైదరాబాద్ వస్తున్నారని, వారు నిమ్స్ లాంటి ఆసుపత్రుల్లో సేవ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రైవేట్‌కు ధీటుగా ఆసుపత్రులను సిద్ధం చేస్తాం అని, త్వరలో 25 ఆస్పత్రులు అందుబాటులోకి వస్తాయని సీఎం తెలిపారు. బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు రెండో అతిపెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చినందుకు డాక్టర్ నాగేశ్వర్ రెడ్డిని అభినందించారు.'ప్రజలకు రెండో అతిపెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చిన డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి అభినందనలు. తెలంగాణ, హైదరాబాద్‌కు నాగేశ్వర్ రెడ్డి గొప్ప పేరు తీసుకొచ్చారు. ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిం ది. నాగేశ్వర్ రెడ్డి భారతరత్నకు అర్హులు. ఆయనకు భారతరత్న వచ్చేలా తెలంగాణ నుంచి నా వంతు ప్రయత్నం చేస్తా. 66 దేశాల నుంచి ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సకు రావడం మనకు గర్వకారణం. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుంది.హైదరాబాద్‌ను హెల్త్ టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.'రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్మాణంలో ఉన్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీపడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తాం. త్వరలో 25 ఆస్పత్రులు అందుబాటులోకి వస్తున్నాయి. వైద్యులకు నా విజ్ఞప్తి, ఏడాదిలో ఒక్క నెల ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేయండి. విదేశాల్లో ఉండే వైద్యులు కూడా అప్పుడప్పుడు ఇక్కడికి వస్తున్నారు. వాళ్లు కూడా నిమ్స్ లాంటి ఆస్పత్రుల్లో సేవ చేసేలా ఏర్పాట్లు చేయండి. వైద్య విద్య చదివిన వాళ్లకు విజ్ఞప్తి, ఒక్క నెల ఏదో ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో సేవ చేయండి. విద్యా వైద్యంకి ఎక్కువ నిధులు కేటాయిస్తున్నాం. పేదలకు ఉచిత వైద్యం, నాణ్యమైన విద్య అందించాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. వైద్య రంగం అభివృద్ధికి రూ.11500 కోట్లు, రూ.21500 కోట్లు విద్యా రంగం అభివృద్ధికి కేటాయించాం' అని సీఎం రేవంత్ చెప్పారు.

## మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

సంగారెడ్డి,జులై2: పాశమైలారంలో జరిగిన ప్రమాదంపై సిగాచీ కంపెనీ స్పందించింది. పరిశ్రమలో పేలుడు కారణంగా 40 మంది మృతి చెందారని, మరో 33 మంది గాయపడినట్లు పేర్కొంది. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదంలో గాయపడిన వారికి పూర్తి వైద్యం అందిస్తామని, అన్ని బీమా క్లెయిమ్ ఇస్తామని స్పష్టం చేసింది. బాధిత కుటుంబాలకు అన్నివిధాలా అండగా ఉంటామని సిగాచీ కంపెనీ హామీ ఇచ్చింది. ఈ మేరకు సిగాచీ తరపున కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రమాదంలో 40 మంది మృతి చెందారు. 33 మందికి గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు పరిశ్రమ నుంచి కోటి పరిహారంతో పాటు అన్ని రకాల బీమా క్లెయిమ్ చెల్లిస్తాం. గాయపడ్డ వారికి పూర్తి వైద్యం అందిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. పరిశ్రమ ప్రమాదంపై నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి లేఖ రాశాం. మూడు నెలల పాటు కంపెనీ కార్యకలాపాలు మూసివేస్తున్నాం. ప్రమాదానికి రియాక్టర్ పేలుడు కారణం కాదు. ప్రమాదంపై తెలంగాణ ప్రభుత్వం దర్యాప్తు చేస్తుంది. ప్రభుత్వం దర్యాప్తు నివేదిక కోసం వేచి చూస్తున్నాం' అని సిగాచీ కంపెనీ సెక్రటరీ వివేక్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదం ఘటనకు సంబంధించి దర్యాప్తుకు సహకరిస్తామని.. నిబంధనలు పాటిస్తాం అని ప్రకటనలో తెలిపింది. ప్రమాదంలో గాయపడిన వారికి సాయం చేయటంతో పాటు వారి కుటుంబాలకు పునరావాసం కల్పిస్తామని వివేక్ కుమార్ పేర్కొన్నారు. 35 ఏళ్లలో ఎలాంటి



ప్రమాదం జరగలేదని.. ఇది ఘోర ప్రమాదని పేర్కొన్నారు. 3 నెలల పాటు కంపెనీని తాత్కాలికంగా మూసివేస్తున్నా ప్రకటించారు. కంపెనీని పదేళ్ల క్రితం ఎలాంగో గౌడకు లీజుకు ఇచ్చామని.. కంపెనీ బాధ్యతలు ఆయనే చూస్తున్నారని తెలిపారు. పేలుడు ఘటనలో ఎలాంగో గౌడ చనిపోవటంతో వివరాలు తెలియడం లేదని తెలిపారు. ప్రమాదంపై స్టాక్ ఎక్స్ఛేంజ్ కు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇక సిగాచి కంపెనీపై 4 సెక్షన్ల కింద కేసు నమోదైంది. కంపెనీ ఉద్యోగి యశ్వంత్ ఇచ్చిన కంప్లైంట్ తో కేసు నమోదయ్యింది. కంపెనీలో వాడుతున్న పాత మిషనరీ కారణంగా పేలుడు సంభవించినట్లు ఎఫ్ఐఆర్ లో పోలీసులు పేర్కొన్నారు.

## మేడారం సమ్మక్క జాతర తేదీలు ఖరారు



ములుగు,జులై2: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మహా జాతర తేదీలు ఖరారయ్యాయి. మేడారం మహా జాతర 2026 తేదీలను కోయ పూజారులు ప్రకటించారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగనుంది.మేడారంలో 2026లో నిర్వహించే శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతర తేదీలను పూజారులు ఖరారు చేశారు. జాతర తేదీలను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు ప్రకటించారు. బుధవారం మేడారంలోని ఎండోన్‌మెంట్ కార్యాలయంలో పూజారులు, పుర ప్రజలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు మాట్లాడారు.2026 జనవరి 28వ తేదీ నుంచి మేడారం జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. 28న బుధవారం సాయంత్రం కన్నెపల్లి నుండి సారలమ్మ, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజు, కొండాయి నుండి గోవిందరాజులను గద్దెలపైకి తీసుకొస్తారని, జనవరి 29వ సాయంత్రం చిలుకలగుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దె మీదకు తీసుకొస్తారని తెలిపారు. అదేవిధంగా జనవరి 30వ తేదీన వన దేవతలకు మొక్కులు చెల్లింపులు, జనవరి 31వ తేదీన తల్లుల వన ప్రవేశం ఉంటుందని ప్రకటించారు. అనివార్య కారణాల రీత్యా 2024 జాతర తేదీలను 9 నెలల ముందుగానే ప్రకటించారు. నాలుగు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. ఆపై 30న వన దేవతలకు భక్తులు తమ తమ మొక్కులను చెల్లించే కార్యక్రమం ఉంటుంది. 31న సాయంత్రం 6 గంటల సమయంలో సమ్మక్క, సారలమ్మ దేవతలు, గోవింద రాజు, పగిడిద్ద రాజు దేవుళ్ల వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని కోయ పూజారులు వెల్లడించారు. ఈ జాతరకు ఏర్పాట్లు చేయాల్సిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూజారులు కోరుతున్నారు. కాగా.. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ములుగు జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం జాతర జరుగుతుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద గిరిజన పండుగగా ప్రసిద్ది చెందింది.

## వరుస గుండెపోటు మరణాలు..కోవిడ్ వ్యాక్సినలతో సంబంధం లేదు

న్యూఢిల్లీ,జులై2: కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు వారు కూడా కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోతుండటం కలవరపెడుతోంది. కర్నాటక లోని హసన్ జిల్లాలో వరుస గుండెపోటు మరణాలపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతోఎలాంటి సంబంధం లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి. ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు' అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటించాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని గుర్తుచేశాయి. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19




రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత.. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి.'భారత్‌లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి.

## అసెంబ్లీలో మేం చర్చకు సిద్ధం..మీరు సిద్ధమా



హైదరాబాద్,జులై2: బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు తాము రెడీ.. సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమా అని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుసవాల్ విసిరారు. బనకచర్లపై అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తామని అన్నారు. బుధవారం తెలంగాణభవన్‌లో హరీష్‌రావు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. . అసెంబ్లీలో బనకచర్లపై చర్చ జరుగుతున్నప్పుడు తమ మైక్ కట్ చేయకూడదని కోరారు. రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ ద్రోహి.. సీఎం హోదాలోనూ రేవంత్‌రెడ్డి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్దాల వైరస్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. బయట వారికి సద్దులు కడుతూ.. ఇంటి మనిషి కేసీఆర్‌పై నిందలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ .. హైదరాబాద్ లో కాకుండా అమరావతి నుంచి ఇచ్చినట్లుందని విమర్శించారు. ఉత్తమ్ పీపీటీ.. ఏపీ సీఎం చంద్రబాబు తయారు చేశాడా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకున్న విషయాన్ని పీపీటీలో ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. అహంకారంతో మాట్లాడితే.. రేవంత్‌ను ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబుతో ఉన్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఇంకా మర్చిపోలేక పోతున్నారని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ఒప్పందం కుదిరిందని, ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6వ తేదీన రేవంత్ తెలంగాణకు మరణశాసనం రాశారని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణలు చేశారు. సెప్టెంబర్ 23వ తేదీన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీసమేతంగా బెజవాడ పోయి బజ్జీలు తిని బనకచర్లకు పచ్చజెండా ఊపారని విమర్శించారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం బనకచర్లకు అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పాము అయితే.. ఎందుకు తమపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ పేరు ఎత్తకుండా ఒక్కసారైనా రేవంత్‌రెడ్డి ఉండగలరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కాకుండా.. రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్ష నేత మాదిరిగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ఆమోదయోగ్యంగా మాట్లాడుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని తేల్చిచెప్పారు మాజీ మంత్రి హరీష్‌రావు. ÷ఖఆర్ఎస్ హయాంలో బనకచర్లపై ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మాజీ మంత్రి హరీష్‌రావు క్లారిటీ ఇచ్చారు. రేవంత్‌రెడ్డే సతీసమేతంగా ఉత్తమ్‌ను విజయవాడ పంపించారని ఆరోపించారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ సీటు కూడా గెలవలేదని.. అంతమాత్రాన ఆ పార్టీ చచ్చిన పాము అవుతుందా అని ప్రశ్నించారు. చచ్చిన పాము ముచ్చట్లు రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి చెప్పుకోవాలని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలే నని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం కాకుండా.. రాజకీయ ప్రయోజనాల కోసమే రేవంత్ మాట్లాడుతున్నారన్ని ÷ర్ అయ్యారు. బనకచర్లపై మంత్రి ఉత్తమ్ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎందుకు పిలవలేదని మాజీ మంత్రి హరీష్‌రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

### శ్రీశైలానికి కొనసాగుతున్న వరద ఉధృతి

శ్రీశైలం,శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. జూరాల నుంచి శ్రీశైలానికి 83.224 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. అదే విధంగా జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా ప్రస్తుతం ప్రస్తుత నీటిమట్టం 875.2 అడుగులు ఉండగా పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 164.7 టీఎంసీలు ఉన్నాయి. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ఉత్తత్తి చేసి35,315 క్యూసెక్కులు దిగువన ఉన్న

## చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు..



హైదరాబాద్,జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదుని, ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారన్నారు.ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాళ్లే అని విమర్శించారు. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండని విజ్ఞప్తి చేశారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళ్లు మాట వినరు అని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. 'బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఎమ్మెల్యేగా ఒక సూచన చేస్తున్నా. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్న లెటర్లు రాసుడు కాదు. సీఎం చంద్రబాబు కోవర్టులు తెలంగాణలో ఉన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, రోడ్డు కాంట్రాక్టులు చూసేది వాళ్లే. ఆ కోవర్టులకు కరెంట్ కనెక్షన్, నల్లా కనెక్షన్‌లు కట్ చేయండి. ఇరిగేషన్ ప్రాజెక్టు పైసలు ఒక్క రూపాయి ఇవ్వకండి. వాళ్లే చంద్రబాబు వద్దకు వెళ్లి కాళ్లు పట్టుకొని బనకచర్ల బంద్ పెట్టిస్తారు. మంచిగ మాట్లాడితే ఆంధ్ర వాళు మాట వినరు' అని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.

## సంపాదకీయం

**గురువారం 03-07-2025**

# అనిశ్చితి... ఆర్థిక ప్రకంపనలు

ఒకప్పుడు అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య బలమైన మైత్రీబంధమే ఉండేది. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా, ఇజ్రాయెల్‌తో ఘర్షణ మొదలైంది. ఆ వైరానికి పరాకాష్టగా కిందటి నెలలో మూడు ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడిచేసింది. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కుదిరినా పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉంది. అయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో షియా వర్గ నేతలు 1979లో ఇరాన్‌లో అమెరికాకు అనుకూలమైన షా పాలనకు అంతంపలికి ఇస్లామిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశా రు. వారు ఇజ్రాయెల్, అమెరికాల పట్ల వైరభావం ప్రదర్శించడానికి సైద్ధాంతిక, భౌగోళిక, రాజకీయ, సైనిక కారణాలెన్నో ఉన్నాయి. ఇరాన్ ఇస్లామిక్ ప్రభుత్వం మొదటి నుంచి పాలస్తీనా విమోచన ఉద్యమానికి గట్టిమద్దతుదారుగా నిలిచింది. ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు దేశాలుగా ఏర్పడాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించినా ఇజ్రాయెల్ దాన్ని ఖాతరు చేయడంలేదు. దాంతో ఇజ్రాయెల్, అమెరికాలపై గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్బొల్లా, యెమెన్‌లో హూతీలు సాగిస్తున్న పోరాటానికి ఇరాన్ అండదండలు ఇస్తోంది. ఇది మూడు దేశాల మధ్య శత్రుత్వాన్ని మరింతగా పెంచుతోంది.

ఇరాన్ మీదా అదే ఎత్తుగడ...

ఇరాన్ అణు కార్యక్రమం సైతం అమెరికా, ఇజ్రాయెల్‌కు కంటగింపుగా మారింది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధ ఒప్పందంపై సంతకం చేయడం వల్ల అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించుకునే స్వేచ్ఛ తనకుందని ఇరాన్ వాదిస్తోంది. కానీ, శాంతియుత ప్రయోజనాల మాటున అణ్వస్త్రాన్ని తయారు చేసే కార్యక్రమంలో ఇరాన్ నిమగ్నమైందని అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలు అనుమానిస్తున్నాయి. ఇరాన్ అణుబాంబును తయారు చేస్తే, తన ఉనికికే ప్రమాదమని ఇజ్రాయెల్ భావిస్తోంది. ఇజ్రాయెల్ దగ్గర అణ్వస్త్రాలు ఉన్నా, అణుబాట వీడాలని ఆ దేశాన్ని ఎవరూ ఒత్తిడి చేయకపోవడం గమనార్హం. నిజానికి ఇరాన్‌తో అణ్వస్త్ర తయారీని విరమింపజేయడానికి అమెరికా పూర్వ అధ్యక్షుడు ఒబామాతోపాటు బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలు సైతం చొరవ తీసుకున్నాయి. ఈ దేశాలు 2015లో ఇరాన్‌తో సంయుక్త సమగ్ర కార్యాచరణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇరాన్ అణ్వస్త్ర సమస్య పరిష్కారమైపోయిందని అందరూ భావించారు. కానీ, ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడైన వెంటనే ఈ ఒప్పందాన్ని రద్దు చేశారు. రెండోసారి అధ్యక్షుడైన తరవాత కూడా అదే పనిచేశారు. గతంలో ఇరాక్‌లో తమకు గిట్టని సద్దాం ప్రభుత్వం జనహనన ఆయుధాలను సమకూర్చుకుందనే వంకతో ఆ దేశంపై దాడి చేసి సద్దాంను సాగనంపింది అమెరికా. ఇప్పుడు ఇరాన్ మీద కూడా అదే ఎత్తుగడ ప్రయోగిస్తోందనే అభిప్రాయం నెలకొంది. చాలాకాలంగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పరోక్ష యుద్ధం నడుస్తోంది. ఈ సమరంలో ఇజ్రాయెల్‌కు అమెరికా అన్ని రకాలుగా వత్తాసు పలుకుతోంది. 2023 అక్టోబరులో ఇరాన్ మద్దతుగల హమాస్ ఇజ్రాయెల్‌పై విరుచుకుపడిన దగ్గరి నుంచి వ్యవహారం ముదిరింది. మొదట ఇరాన్ ఎగదోస్తున్న హమాస్, హెజ్బొల్లా, హూతీలను వరస దాడులతో బలహీన పరచిన మీదట ఇజ్రాయెల్ మొన్న జూన్ 13న నేరుగా ఇరాన్‌పై దాడులు చేసింది. దీనికి ఇరాన్ డ్రోన్, క్షిపణి దాడులతో బదులిచ్చింది. అమెరికా జూన్ 22న ఇరాన్‌లోని అణు కేంద్రాలపై బీ2 బాంబర్ విమానాలతో దాడిచేసి ఇక ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కట్టిపెట్టాలని హుకుం జారీ చేసింది. ప్రస్తుతానికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతున్నా అది తాత్కాలికమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడి చేయడం ద్వారా ఆ దేశం అణుబాంబును తయారు చేయకుండా నిరోధించగలిగామని అమెరికా చెప్పుకొంటున్నా, బాంబు తయారీకి అవసరమైన శుద్ధిచేసిన యురేనియంను ఇరాన్ భద్రంగా తరలించేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమానికి నిజంగానే గండిపడిందా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. మొత్తానికి అటు అణ్వస్త్ర సమస్యా పరిష్కారం కాలేదు, ఇటు పాలస్తీనా సమస్య కూడా కొనసాగుతోంది. దీంతో పశ్చిమాసియాపై అలుముకున్న అనిశ్చితి ఇప్పట్లో తొలగేలా లేదు. ఇజ్రాయెల్- ఇరాన్, ఇజ్రాయెల్- పాలస్తీనా సమస్యలు పశ్చిమాసియాకే పరిమితమయ్యేవి కాదు. మిగతా ప్రపంచంపైనా రాజకీయ ంగా, ఆర్థికంగా పెను ప్రభావం చూపుతాయి. రాజకీయ లక్ష్యాలను సాధించు కోవడానికి ఇష్టారాజ్యంగా బలప్రయోగానికి దిగే ధోరణి ఇటీవల ప్రబలిపో యింది. నాగోర్నో-కారబాఖ్ ప్రాంతం కోసం అజర్ బైజాన్ ఆర్మీనియాపై దాడి చేయడం, ఉక్రెయిన్‌పై రష్యా ప్రత్యేక సైనిక చర్యకు దిగడం, హమాస్ దాడి వంటివి ఇందుకు ఉదాహరణలు. ఈ వరసలోనే ఇరాన్‌పై అమెరికా కూడా విరుచుకుపడింది. ఈ క్రమంలో సయోధ్య సాధన కోసం ఐరాస వంటి సంస్థలను ఎందుకు ఉపయోగించుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భారత్‌కు నష్టమే

ప్రపంచానికి చమురు, సహజ వాయువును సరఫరా చేసే ప్రధాన ప్రాంతంగా పేరొందిన పశ్చిమాసియాలో యుద్ధం అంతర్జాతీయంగా ఆర్థిక ప్రకంపనలు సృష్టిస్తోంది. అది అలాగే కొనసాగితే ప్రపంచ వాణిజ్యాన్ని కుంగదీస్తుంది. ముఖ్యంగా భారతదేశ ఇంధన భద్రత దెబ్బతిని అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. డ్రోన్లు, క్షిపణులవల్ల పశ్చిమాసియా గగనతలంలో రక్షణ కొరవడి పౌర విమాన మార్గాలు మూసుకుపోతాయి. ఇరాన్‌లోని చాబహార్ రేవు గుండా మధ్యాసియాకు వాణిజ్య మార్గం తెరవాలనీ, భారత్ నుంచి పశ్చిమాసియా మీదుగా ఐరోపాకు ఆర్థిక నడవా-ఐమెక్‌ను నిర్మించాలనే ఆశలకు విఘాతం కలుగుతుంది. పశ్చిమాసియా దేశాల్లో పనిచేస్తున్న భారతీయ కార్మికులు, నిపుణులు స్వదేశానికి పంపే డాలర్ల మొత్తాలు కోసుకుపోతాయి. యుద్ధం తీవ్రమైతే వారందరినీ అపార వ్యయప్రయాసలకు ఓర్చి స్వదేశానికి తీసుకురావాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సంక్షోభం సమసిపోదు కాబట్టి మిగతా ప్రపంచానికి అనిశ్చితి తొలగనట్లే. ఇకనైనా ఇజ్రాయెల్, పాలస్తీనాలను రెండు దేశాలుగా ఏర్పరచాలి. ఇరాన్ అణు సమస్యకు సామరస్య పరిష్కారం గుర్తించాలి. రాజకీయ లక్ష్యాల కోసం ప్రభుత్వాలు, ఉగ్రవాదులు బలప్రయోగానికి దిగకుండా సంయమనం పాటించాలి. తగిన సంస్కరణలతో ఐక్యరాజ్య సమితిని తిరిగి బలోపేతం చేయాలి. ప్రపంచం అవ్యవస్థలోకి జారిపోకుండా చూడాలంటే ఇలాంటి చర్యలు తప్పనిసరి.

# ఆంధ్రాలోని తెలంగాణ ఉద్యోగులపై దయ లేదా! వెనక్కు తేవడానికి ఇంకెన్నేళ్లు?



హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు అయ్యింది. ఫలాలు అందరూ అనుభవిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రంలో కొందరు నాయకులు వందల కోట్లు కూడబెట్టుకున్నారు. మరికొందరు పదవులూ అనుభవిస్తున్నారు. కానీ ప్రత్యేక రాష్ట్రం కొందరిపాలిట శాపంగా మారింది. వారే ఆంధ్రాలో మగ్గుతున్న అసలు సిసలు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు. ఇంకా మూడు వందల యాభైకి పైగా ఉద్యోగ కుటుంబాలు మనో వేదనకు గురవుతున్నాయి. రాష్ట్రం వచ్చిందన్న సంతోషం తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగ కుటుంబాల్లో లేదు. ఆంధ్రా నుంచి తెలంగాణలోకి రావడానికి గత పదకొండు సంవత్సరాలుగా వారు ఎక్కని కొండ లేదు దిగని మెట్టు లేదనే విధంగా ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా వారి న్యాయమైన డిమండ్‌ను పరిష్కరించేందుకు చొరవ తీసుకోకపోవడం లేదని ఆంధ్రలోని తెలంగాణ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ మాట విన్నందుకు..

పార్లమెంటులో ప్రత్యేక రాష్ట్రం బిల్లు పెట్టే సందర్భంలో ఉద్యోగుల కేటాయింపుల విషయంలో ఉద్యోగ సంఘాల నాయకుల మధ్య గొడవలు జరిగాయి. ఆంధ్రా మూలాలు ఉన్న ఉద్యోగులందరూ ఏపీకి వెళ్లాల్సిందేనంటూ తెలంగాణ ఉద్యమ నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు గట్టిగా పట్టుబట్టారు. ఇలా మీరు పట్టుబడితే కష్టమని, వచ్చే తెలంగాణను అడ్డుకున్నవారు అవుతారంటూ ఒకప్పటి ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడు పరుచూరి అశోక్ బాబు కుండ బద్దలు కొట్టి చెప్పారు. విభజన తరువాత ఏమైనా ఉంటే అప్పుడు చూసుకుందామని సముదాయించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆరు నెలల ముందు జరిగిన ఎన్నికల్లో అశోక్ బాబు ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత ఆయన తన ఉద్యోగానికి వీఆర్ఎస్ తీసుకుని టీడీపీలో చేరి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు కూడా. అశోక్ బాబు సూచన కాదనలేక తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులు సరేనన్నారు. ఆ తరువాత జనాభా నిష్పత్తి ప్రకారం ఉద్యోగులు, ఆస్తుల విభజన పూర్తయింది. కానీ ఇంకా కొందరి ఉద్యోగుల బాధలు, ఆస్తుల విభజన సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి.

విభజన సమయంలో ఏపీకి ఆరువేల మంది

విభజన సమయంలో సుమారు ఆరు వేల మంది వరకు తెలంగాణకు చెందిన ఉద్యోగులను ఆంధ్రకు కేటాయించారు. వారిలో జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులు, రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ఉన్నారు. అయితే రాష్ట్ర స్థాయి అధికారులకు పనిచేసే రాష్ట్రం ఎంచుకునే ఆప్షన్ ఇచ్చి, జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులకు ఇవ్వకపోవడం తమ పాలిట పెద్ద శాపమనే ఆవేదనలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన కొత్తలో ఏపీకి కేటాయించిన కొందరు.. ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి నాటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావును కలిశారు. మీరందరూ వెళ్లి విధుల్లో చేరండి, వెంటనే వెనక్కి తీసుకువస్తానంటూ నమ్మే విధంగా భరోసా ఇచ్చారు. కేసీఆర్ భరోసా ఇచ్చారనే గుడ్డి నమ్మకంతో సుమారు ఆరు వేల మంది జోనల్, మల్టీ జోనల్ ఉద్యోగులు ఏపీ రాష్ట్రంలో చేరారు. ఉద్యోగుల సమస్యలు పరష్కరించేందుకు ఏర్పాటు అయిన కమల్ నాథన్ కమిటీ ఇరు రాష్ట్రాల ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపింది. ఉభయ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, వారి కింది అధికారులు కూర్చుని పరస్పరం ఉద్యోగులను శాశ్వత బదిలీ చేసుకుంటే తనకేమీ అభ్యంతరం లేదని చెప్పారు. ఈ విషయంలో కేసీఆర్ ఏమాత్రం చొరవ తీసుకోకపోగా, ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు ఇవ్వకపోవడంతో నాలుగో తరగతి ఉద్యోగులు ఆగ్రహానికి లోనయ్యారు. సచివాలయం ముందు సదరు ఉద్యోగులు దుస్తులు విప్పి ఆందోళనకు దిగడమే కాకుండా తిట్టిపోశారు. దీన్ని మనసులో పెట్టుకున్ని కేసీఆర్ వారి విషయంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా నాలుగో తరగతి ఉద్యోగి ఏపీ నుంచి తెలంగాణకు వస్తే సచివాలయంలో జాయినింగ్, పోస్టింగ్ ఆర్డర్ ఇవ్వవద్దని, సచివాలయం బయటే పోస్టింగ్ ఇవ్వాలని కేసీఆర్ అధికారులకు స్పష్టం చేశారని అప్పట్లోనే వార్తలు వచ్చాయి. కేసీఆర్ ఆదేశాల కారణంగా ఒకప్పుడు ఉమ్మడి సచివాలయంలో చేసి, ఏపీకి వెళ్లి, తిరిగి తెలంగాణకు వచ్చిన నాలుగో తరగతి ఉద్యోగులు బయటి కార్యాలయాల్లో పని చేస్తున్నారు.

రిటైర్మెంట్ అయినా తెలంగాణలో ఇప్పించండి..

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి మొదలైన తెలంగాణ స్థానికత ఉద్యోగుల కష్టాలు ఇప్పటి వరకు తీరడం లేదు. తమ గోడు చెబుతామంటే వినేవాడు ఎవరూ లేరని వారు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో తిరగని మంత్రి కార్యాలయం లేదు, అడగని ఎమ్మెల్యేలు లేరు. ఎక్కే మెట్టు దిగే మెట్టు ఏడుకొండల వాడా అన్న తీరుగా పదేళ్లు చెప్పులు అరిగేలా ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం దక్కలేదని చెబుతున్నారు. ఈ పదకొండున్నర సంవత్సరాల కాలంలో సుమారు పదిహేను వందల మంది వరకు పదవీ విరమణ చేశారని సమాచారం. కొందరు ఉద్యోగులు స్వరాష్ట్రంలో రిటైర్మెంట్ అయ్యేందుకు సర్వశక్తులు ఒడ్డారు. కనీసం రిటైర్మెంట్‌కు రెండు రోజుల ముందు తెలంగాణ ప్రభుత్వంలో చేరి, ఆ తరువాత ఇంటికి వెళ్దామని అనుకున్నారు కాని వారి తలరాత అనుకూలించలేదని ఒక సచివాలయ ఉద్యోగి తెలిపారు.

ఇప్పటికీ ఇంకా మూడు వందల యాభై మంది వరకు తెలంగాణకు రావాల్సి ఉందని అంటున్నారు. వీరిని తెలంగాణ తీసుకువచ్చేందుకు రెండు నెలల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశంలో చర్చించారు. ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ వారిని తిరిగి వెనక్కి రప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎం కోదండరామ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ చిన్నారెడ్డి, ఐఏఎస్ అధికారి దివ్య దేవరాజన్‌తో కమిటీ వేశారు. వారి సిఫారసు మేరకు గతేడాది 148 మంది ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వచ్చారు. తాజాగా మంగళవారం ఆరుగురు నాలుగో తరగతి ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వంలో జాయిన్ అయ్యారు. 350 మంది ఉద్యోగులను వెనక్కి రప్పించే ఫైలు ప్రభుత్వం వద్ద ఉందని తెలుస్తున్నది. ముఖ్యమంత్రి కూడా వీరి విషయంలో సానుకూలంగానే ఉన్నారని తెలిసింది. అయితే ఏపీ నుంచి పైరవీలు చేసుకుని సింగిల్ గా వచ్చేవారి విషయంలో ఒక న్యాయం, కొంత మంది కలిసి వస్తే మాత్రం మరో న్యాయం పాటించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏపీలో ఏ క్యాడర్ ఉంటే అదే క్యాడర్ ఇక్కడ కొనసాగించాలని ఏపీ నుంచి వచ్చే తెలంగాణ స్థానికత ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

# కలవరపెడుతున్న వర్షాభావ పరిస్థితులు

న్యూఢిల్లీ,వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృధాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయటపడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధా నించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. దేశ జనాభా పెరుగుతున్న క్రమంలో మన వ్యవసాయాన్ని బలోపేతం చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్దం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు.



వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపని గా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చ లేక,అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇపుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్దిగా ఎదిగేలా చేయాలి. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరిం చడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు.

# పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం

రాజమండ్రి,పేదలను ఆదుకునేలా 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని.. ఈ కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా జరగడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వటం వల్ల ప్రజలు ఆనందంతో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పెన్షన్లు సరిగా ఇవ్వలేదని విమర్శించారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసాన్ని తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. నెలలోపు డీఎస్సీ ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా మలకపల్లి ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు ఇస్తున్నామని వెల్లడించారు. నూటికి 13 మందికి పింఛన్లు ఇచ్చే ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. ఏపీని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తామని అన్నారు. గతంలో వ్యవస్థలన్నీ పడకేశాయని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని వ్యాఖ్యానించారు. 'అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం.. ఆదాయం పెంచుతామని' వెల్లడించారు. పెరిగిన ఆదాయం పేదలకు పంచి అభివృద్ధికి ఖర్చు పెడతామని చెప్పుకొచ్చారు. తన తల్లి పడిన కష్టం ఏ మహిళకూ ఉండకూడదని ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామన్నారు చంద్రబాబు. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామని వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పింఛన్లు ఇచ్చేటప్పుడు ఉద్యోగులు సేవా భావంతో ఉండాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో పేదవారిని చులకనగా చూస్తే సహించనని హెచ్చరించారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కష్టపడుతున్నానని తెలిపారు. మానవత్వంతో దివ్యాంగుల కోసం 12 రెట్లు పింఛన్లు పెంచామన్నారు. రాజకీయ ముసుగు వేసుకొని ప్రజాధనాన్ని దోచుకుంటే సహించనని వార్నింగ్ ఇచ్చారు. ఎన్డీయే కార్యకర్తలు దగ్గరుండి మరీ లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ పరిశీలించాలని ఆదేశించారు. 'డ్రగ్స్, గంజాయి విక్రయించే వారి తాట తీస్తా. ఆడబిడ్డపై చేయివేసే వారికి అదే చివరి రోజు. రౌడీయిజాన్ని సహించను' అని తీవ్రంగా హెచ్చరించారు. 'సాధారణ కుటుంబంలో పుట్టి దేవుని కృప వల్ల అంచెలంచెలుగా అభివృద్ధి చెందాం. డాక్టర్ అంబేద్కర్ సాధారణ కుటుంబం నుంచి జన్మించి తరతరాలు గుర్తుండే రాజ్యాంగాన్ని రచించారు. లక్ష బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. రూ.10లక్షల కోట్ల అప్పులు తీర్చాలని' అన్నారు. పోలవరాన్ని వైసీపీ భ్రష్టుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరాన్ని 2027కి పూర్తి చేసే అదృష్టం దేవుడు తనకే ఇచ్చారన్నారు. డిసెంబర్ నాటికి డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. గోదావరి పుష్కరాలు మూడోసారి తానే చేయబోతున్నానని.. కనీవినీ ఎరగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.రాజకీయాల్లోకి రౌడీలు వస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. పాయకరావుపేట హాస్టల్‌లో సరిగ్గా భోజనం పెట్టని ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. వివేకా మృతిపై ఆయన కుమార్తె అనుమానం వ్యక్తం చేస్తే గొడ్డలి పోటుగా నిర్ధారించామని అన్నారు. రౌడీషీటర్‌ను పలకరించటానికి జగన్ వెళ్లి రౌడీయిజం చేశారని ఫైర్ అయ్యారు. జగన్ కారు కిందపడి చనిపోతే కుక్కను లాగినట్టు పక్కన లాగి పాడేశారన్నారు. 'నా జీవితంలో నేను ఎక్కడా ఎవర్నీ కొట్టలేదు, నాపై కేసులు లేవు. ప్రజలను కాపాడేందుకు నేరస్తులతో రాజకీయ పోరాటం చేస్తున్నా. నేరస్తులకు ఓటు వేసి గెలిపిస్తారా' అని సీఎం ప్రశ్నించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆగస్టు 15 నాటికి నూరు శాతం సేవలు అందిస్తామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది తలసరి ఆదాయం రూ.30వేలు పెంచామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యం

విజయవాడ,డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వ్యాఖ్యానించారు. కూటమి నేతలతో సమన్వయం చేస్తూనే.. ఏపీ బీజేపీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మనం ఐదు శాతం సీట్లు తీసుకోవడం కాదని.. మనమే మరో పార్టీకి సీట్లు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుకున్నారు. మంగళవారం విజయవాడ బీజేపీ కార్యాలయంలో శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడారు. ఏపీ బీజేపీ రథసారథిగా ఎంపికైన పీవీఎన్ మాధవ్‌కు శ్రీనివాస వర్మ శుభాకాంక్షలు తెలిపారు. పురంధేశ్వరి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పార్టీ కోసం ఎంతో పనిచేశారని శ్రీనివాస వర్మ కొనియాడారు. తాను ఎంపీగా, కేంద్రమంత్రిగా పురంధేశ్వరి సహకారంతో ఎదిగానని ఉద్ఘాటించారు. పీవీఎన్ మాధవ్ కూడా నిత్యం పార్టీ కోసం పని చేస్తారని అన్నారు. మాధవ్ తండ్రి చలపతిరావు కూడా పార్టీ కోసం పరితపించే వారని గుర్తుచేసుకున్నారు. అప్పటి నాయకులకు చలపతిరావు సేవల గురించి తెలియదని చెప్పారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తి చలపతిరావే అని గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబం నుంచి వచ్చిన మాధవ్ కూడా సొంతంగా ఎదిగారని కొనియాడారు. మాధవ్ ఏపీ బీజేపీని బలోపేతం చేస్తారనే నమ్మకం తమకు ఉందని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేసేలా పీవీఎన్ మాధవ్ చూడాలని కోరారు. కింది స్థాయి కార్యకర్తలతో మాట్లాడి.. వారి సమస్యలు పరిష్కరించేలా మాధవ్ పని చేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ సూచించారు. ఇకపోతే రాజకీయాల్లో స్వలాభాపేక్ష ఏ రోజూ తాను చూసుకోలేదని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప.. తన రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదన్నారు. తనను ప్రోత్సహించిన, ప్రతిఘటించిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని తాను ఆశిస్తున్నానని ఎంపీ పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికయ్యారు. బీజేపీ జెండాను మాధవ్‌కు ఇచ్చి.. పార్టీ బాధ్యతలను పురంధేశ్వరి అప్పగించారు. మాధవ్ ప్రమాణ స్వీకారోత్సవ సభలో పురంధేశ్వరి మాట్లాడారు. '2013లో బీజేపీలోకి నేను వచ్చాను. బీజేపీలోకి వచ్చిన నాటి నుంచి నాకు పార్టీ గౌరవం ఇస్తోంది. అన్ని విధాలుగా నాకు గౌరవం ఇచ్చిన పార్టీకి కృతజ్ఞతలు. పీవీఎన్ మాధవ్ తండ్రి చలపతిరావు పోరాట యోధులు. చలపతిరావు నుంచి పట్టుదల, ఎలా ముందుకు వెళ్లాలో నేర్చుకున్నాను. వెంకయ్య నాయుడు నుంచి చనువు, చొరవ నేర్చుకున్నాను. ఏపీ బీజేపీకి జీవితం అంకితం చేసిన నాయకుల నుంచి నేను చాలా నేర్చుకున్నా. నన్ను ప్రోత్సహించిన, ప్రతిఘటించిన కార్యకర్తలు ఇరువురికి నా ధన్యవాదాలు' అని రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి చెప్పారు. కార్యకర్త సహకారం లేకపోతే ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవడం సాధ్యం కాదు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలిగా రెండేళ్లల్లో పార్టీ బలోపేతం కోసం నా వంతు కృషి చేశా. నాకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించా. స్వలాభాపేక్ష ఏ రోజూ నేను చూసుకోలేదు. పార్టీకి లాభం చేకూర్చాలనే భావన తప్ప.. నా రెండు సంవత్సరాల ప్రస్థానంలో మరే ఆలోచన లేదు. పీవీఎన్ మాధవ్ కూడా కార్యకర్తలకు అనుగుణంగా వెళతారని నేను ఆశిస్తున్నాను. ప్రభుత్వంలో భాగస్వాములుగా ఒకొక్క మాట ఆచితూచి మాట్లాడాలి' అని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి సూచించారు. గత రెండేళ్లుగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా పురంధేశ్వరి పని చేసిన విషయం తెలిసిందే.

## సమస్యలకు సమాధానం లేదు

న్యూఢిల్లీ,తరచుగా విదేశాలకు ప్రయాణించే సూపర్ ప్రీమియమ్ ప్రధాని ఐదు దేశాల 'విహారయాత్ర'కు బయలుదేరారని కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోడీని ఎద్దేవా చేసింది. మణిపూర్ ఉద్రిక్తతలు, భారత్ పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వాదనలు సహా నాలుగు అంశాలపై సమాధానం చెప్పకుండా ప్రధాని మోడీ తప్పించుకుంటున్నారని మండిపడింది. ప్రధాని మోడీ నిర్ణయం వల్లే ఆపరేషన్ సిందూర్‌లో మొదటి రెండు రోజుల్లో భారత్ తిరోగమనం ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన ఆరోపణలు నుండి ప్రధాని పారిపోతున్నారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జ్ కమ్యూనికేషన్స్ జైరాం రమేష్ ఆరోపించారు. ఆపద,కష్టసమయంలోనూ కొందరు వ్యక్తులు ధైర్యంగా ముందుకు సాగుతారు. కానీ తప్పించుకునేందుకు 'తరచుగా విదేశాలకు ప్రయాణించే' మన ప్రధాని 8 రోజుల విహార యాత్రకు బయలుదేరారు' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశాన్ని ఆందోళనకు గురిచేస్తున్న నాలుగు సమస్య నుండి ఆయన పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ పట్టాలు తప్పినప్పటి నుండి, అక్కడి ప్రజలు సాధారణ జీవన పరిస్థితుల నుండి దూరమైనా ప్రధాని మోడీ ఒక్కసారి కూడా మణిపూర్ సందర్శించలేదని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ప్రధాని మోడీ నిర్ణయాల కారణంగా భారత్ కొంత మేర నష్టాన్ని ఎదుర్కొందని రక్షణ అధికారులు వెల్లడించిన వార్తలపై సమాధానం చెప్పకుండా తప్పించుకునేందుకు ప్రధానిమోడీ పారిపోతున్నారని జైరాం రమేష్ మండిపడ్డారు. బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ సమ్మిట్ పర్యటనతో పాటు ఎనిమిదిరోజుల పర్యటనలో ప్రధాని మోడీ ఘనా, ట్రినిడాడ్, టొబాగో, అ÷ర్జ్జంటీనా, నమీబియాలను సందర్శించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## గాజాపై కొనసాగిన ఇజ్రాయిల్ దాడులు

గాజా,గాజాపై ఇజ్రాయెల్ దళాలు మరోమారు బాంబుల వర్షం కురిపించాయి. మంగళవారం గాజాలోని కేఫ్, పాఠశాల, శరణార్థి శిబిరాలపై వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 95మంది పాలస్తీనియన్లు చనిపోయారు.ఈ దాడుల్లో పౌర మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాఠశాలలు, కేఫ్‌లు, ఆహార పంపిణీ కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగాయి. 95 మంది పాలస్తీనియన్లు చనిపోగా, వీరిలో చాలా మంది సాధారణ పౌరులు ఉన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఉన్నారు. ఉత్తర గాజాలోని అల్-బఖా కెఫెటేరియాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 39 మంది మృతిచెందారు. డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.మృతుల్లో ఓ జర్నలిస్ట్ ఇస్మాయిల్, మహిళలు, పిల్లలు ఉన్నారు.ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఈ దాడి చేశాయి. ఈ బాంబు దాడిలో కేఫ్ నేలమట్టమైంది.భూమిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. సోమవారం కూడా ఇజ్రాయెల్ దళాలు గాజా నగరంలోని జీటౌన్ పరిసరాల్లో దాడులు చేశారు. శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్? వైమానిక దాడి చేయగా 13 మందిని చనిపోయారు. ఇజ్రాయెల్ సైన్యం గాజా నగరంలోని యాఫా పాఠశాలపై కూడా బాంబు దాడి చేసింది. ఇది వందలాది మంది పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పిస్తోంది. ధ్య గాజాలోని ఓ ఆస్పత్రిపై కూడా ఇజ్రాయెల్? దళాలు విరుచుకుపడ్డాయి. వేలాది కుటుంబాలు ఆశ్రయం పొందిన దేయిర్ ఎల్‌బలాలోని అల్ అక్సా ఆస్పత్రి ప్రాంగణంపై ఇజ్రాయెల్ దళాలు దాడి చేశాయి. హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పౌరులు ఉన్న ప్రాంతాల నుండి హమాస్ పనిచేస్తోందని అందువల్ల ప్రజల మరణాలకు హమాస్ కారణమని ఇజ్రాయెల్ ఆరోపిస్తుంది. దాడులు చేసే ముందు పౌరులను హెచ్చరిస్తున్నామని ఇజ్రాయెల్? తెలిపింది. ఈ దాడులపై ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర పౌర ఆశ్రయాలపై దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అని మానవ హక్కుల సంస్థలు ,ఐక్యరాజ్యసమితి చెబుతున్నాయి. ఈ సంఘటనలు గాజాలో నెలకొన్న తీవ్ర మానవతా సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయంటున్నారు.

## కానరాని కదలిక...

న్యూఢిల్లీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి బిల్లును తీసుకుని రాగలదా అన్నచర్చ సాగుతోంది. దీనిపై ఏకాభిప్రాయం మాత్రం రాదని విపక్షాల తీరును బట్టి తెలుస్తోంది. విపక్షాలు కూడా ఈ విషయంలో తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. అనంతరం దీనిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించడం ద్వారా ముందుకు తీసుకుని రావాన్న ప్రయత్నాలు సాగడం లేదు. ఇప్పటికే దీనిపై అనేక రాజకీయ పక్షాలు విమర్శల దాడిని పెంచాయి. అయితే గత సార్వత్రిక ఎన్నికలకు ముందే దీనిని తీసుకుని వస్తారని అనుకున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలైలో ప్రారంభం కాబోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ఈ సమావేశాల్లోనే పార్లమెంటుకు సమర్పించి, అనంతరం దానిని పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించే అవకాశం ఉందని అంటున్నారు. సిబ్బంది, ప్రజా సమస్యలు, న్యాయ వ్యవస్థకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం షెడ్యూలు ప్రకారం, లా కమిషన్, లీగల్ అ్గ÷ర్స్, న్యాయ మంత్రిత్వ శాఖలలోని లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్స్ ప్రతినిధుల అభిప్రాయాలను స్వీకరిస్తుంది. దేశంలోని అన్ని వర్గాలవారికి, ప్రతి ఒక్కరికీ ఒకే చట్టం అమలు కావాలని గతంలో మోడీ పదేపదే చెప్పారు. ఈ సున్నితమైన అంశంపై ముస్లింలను కొందరు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. యూసీసీని తీసుకురావాలని సుప్రీంకోర్టు కూడా చెప్పిందని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న వారు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారన్నారు. ఒక దేశం రెండు రకాల వ్యవస్థలను ఎలా అమలు చేయగలదని ప్రశ్నించారు. బీజేపీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీల్లో యూసీసీ కూడా ఉన్న సంగతి తెలిసిందే. భారత రాజ్యాంగంలోని అధికరణ 44 కూడా ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావాలని చెప్తోంది. మోదీ వ్యాఖ్యలతో గత రెండుమూడేళ్లుగా యూసీసీపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి. దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, మణిపూర్ హింసాకాండ వంటి సమస్యలు ఉన్నాయని, ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మోదీ యూసీసీ అంశాన్ని లేవనెత్తుతున్నారని దుయ్యబడుతున్నాయి. ఉమ్మడి పౌర స్మృతి అమల్లోకి వస్తే వివాహం, విడాకులు, దత్తత, వారసత్వం వంటి అంశాల్లో దేశంలోని ప్రజలందరికీ ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తాయి. ప్రస్తుతం హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులకు వేర్వేరు వ్యక్తిగత చట్టాలు అమలవుతున్నాయి. హిందూ చట్టాల ప్రకారం తల్లిదండ్రుల ఆస్తిలో వారసత్వ హక్కులు పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఉన్నాయి. క్రైస్తవులకు వర్తించే చట్టం ప్రకారం క్రైస్తవ మహిళలకు ముందుగా నిర్ణయించిన వాటా మాత్రమే లభిస్తుంది. పిల్లలు, ఇతర బంధువులు ఉండటాన్ని బట్టి ఈ వాటా ఉంటుంది. పారశీక మతానికి చెందిన మహిళ తన భర్త మరణించినట్లయితే, తన పిల్లలతో సమాన వాటాను పొందవచ్చు. ముస్లిం మహిళలకు తమ తండ్రి ఆస్తిలో పురుషులకు లభించే వాటాలో సగం లభిస్తుంది. అంతేకుండా చట్టాలు సమానంగా ఉంటాయి. అయితే దీనిని తీసుకుని రావడం ఎంతవరకు విజయం సాధిస్తుందన్నదే ప్రశ్న.

# బీసీల చెవిలో 'కమలం' పువ్వు?



హైదరాబాద్,రాష్ట్రంలో బీసీలను బీజేపీ అధిష్ఠానం ఫక్తు ఓటు బ్యాంకుగా భావిస్తోంది. ఎన్నికలొస్తేనే ఆ పార్టీ నేతలకు బీసీలు గుర్తుకు వస్తారు.. ఏకంగా సీఎం అభ్యర్థిగా మారుతారూ..మిగిలిన సమయంలో వెనుకబడిన వారిని పట్టించుకోవడం లేదు. అందివచ్చిన అవకాశాలను కల్పించకుండా%ొ% ప్రధానమైన పదవులను అగ్రకులాలకు అప్పగిస్తున్నారు.. ఇదీ రాష్ట్ర బీజేపీలోని బీసీ నేతల మనోగతం. ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ మాదిరి అందరూ బహిరంగంగా మాట్లాడకపోయినా అంతర్గతంగా ఆ పార్టీలో ప్రస్తుతం బీసీ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక బీసీ సంఘాలు మాత్రం బీజేపీ తీరుపైన బహిరంగంగా మండిపడుతున్నాయి. బీజేపీని బీసీ వ్యతిరేక పార్టీగా అభివర్ణిస్తున్నాయి. బీసీ సంఘాల విమర్శలను పక్కనపెడితే ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలు సైతం ఆరోపణలకు ఊతమిస్తున్నాయి. గతంలో ఆ పార్టీ శాసనసభ పక్షనేత ఎంపికతోపాటు తాజాగా రాష్ట్ర బీజేపీ సారథి నియామకంలో కూడా పార్టీ అధిష్ఠానం ఇదే తీరుగా వ్యవహరించింది. నూతన అధ్యక్షుడి బ్రాహ్మణకులానికి చెందిన రామచందర్ రావును ఎంపిక చేసింది. పార్టీ విధేయుడిగా, సీనియర్‌గా రామచందర్ రావును ఎంపిక చేశారని చెబుతున్నారు. పార్టీ పరంగా ఈ ఎంపిక కరెక్టా? కాదా? అనేది చూస్తే.. గత ఆరు నెలలుగా బీసీ నాయకునికి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారని ఆ పార్టీ వర్గాలే పెద్ద ఎత్తున ప్రచారం చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. తీరా ఎ ంపిక దగ్గరికి వచ్చే సరికి బీసీలను కాదని, అగ్రకులానికి పెద్దపీట వేశారు. దీంతో బీసీలకు అన్యాయం జరుగుతోందనే ప్రచారం ఇంటా బయట సాగుతోంది.

### గత ఎన్నికల్లో బీసీ సీఎం నినాదం

తెలంగాణలో ఏడాదిన్నర క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలకు తెరలేపిన విషయం విధితమే. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే రెడ్డి, బీఆర్ఎస్ గెలిస్తే వెలమ సామాజికవర్గం వ్యక్తులు సీఎం అయ్యే అవకాశం ఉందని పసిగట్టి వ్యూహాత్మకంగా బీసీ సీఎం పాచికను బీజేపీ ప్రయోగించింది. తాము అధికారంలోకి వస్తే బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతను సీఎంగా చేస్తామంటూ ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేశారు. మోదీ, అమిత్ షా, నడ్డా తదితరులు ఇదే అంశానికి ప్రాధాన్యత నిచ్చారు. ఎట్లాగూ తాము అధికారంలోకి వచ్చేదిలేదూ%ొ% బీసీని ముఖ్యమంత్రిని చేసేది లేదనుకున్నారా? లేక మెజార్టీ స్థానాలు సాధించేందుకు బీసీ ఓటు బ్యాంకు మీద కన్నేశారా? మొత్తానికి బీసీ నినాదాన్ని హోరెత్తించారు. ఈ మేరకు ఓటు బ్యాంకును పెంచుకున్నారు. బీసీ సీఎం నినాదం ముందుకు రాగానే బీజేపీలో ఈటల, లక్ష్మణ్, బండి సంజయ్, అర్వింద్ పేర్లు చర్చకొచ్చాయి. ఈటల పేరు ప్రముఖంగా వినిపించింది. ఈ క్రమంలో ఈటల తన సొంత నియోజకవర్గమైన హుజురాబాద్ తో పాటు అప్పటి సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండు స్థానాల్లో ఓటమిపాలయ్యారు.

### బీజేపీలో అర్హులైన బీసీ నేతలు లేరా?

బీసీ నేతగా, ఎమ్మెల్యేగా ఉన్న రాజాసింగ్ ను బీజేపీ అధ్యక్షునిగా పోటీచేసేందుకు కనీసం నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని స్వయంగా ఆయనే పార్టీ నాయకత్వంపై మండిపడ్డారు. ఈ మేరకు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ నాయకత్వం రాజాసింగ్ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకోకపోయినప్పటికీ నూతన అధ్యక్షుని ఎన్నికవేళ ఈ అంశం రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా బీసీలను ఎదగనీయకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలకు బలంచేకూరుతోంది. బీజేపీలో అర్హులైన బీసీ నేతలు లేరా? అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. గత కొద్ది రోజులుగా పార్టీ అధ్యక్షునిగా ఈటలకు అవకాశాలున్నట్లు భారీ ప్రచారాన్ని సాగించారు. ఇప్పుడు ఆయనను పక్కనపెట్టారు. ఈటల కాకుంటే ఎంపీ ధర్మపురి అర్వింద్, సీనియర్ నేత తల్లోజుల ఆచారి, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తదితర బీసీ నాయకులున్నారు.

### బీసీ నేతల చెవిలో పువ్వు

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే సీఎం స్థానానికి అర్హులైన బీసీ నాయకులు ఇతర పదవులకు అర్హులుగా ఆ పార్టీ అధిష్ఠానానికి కనిపించడం లేదా? అంటూ ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కేవలం సీఎం స్థానం మాత్రమే బీసీలకు రిజర్వు చేసిపెట్టారా? అంటూ సెటైర్లు వేస్తున్నారు. బీజేపీ శాసనసభాపక్ష నేత ఎంపికలో సైతం బీసీలను పక్కనపెట్టి మహేశ్వర్ రెడ్డికి పట్టం కట్టారు. బీసీ రాజాసింగ్‌కు ఇక్కడ కూడా అన్యాయమే జరిగిందంటున్నారు. తొలిసారి గెలిచిన మహేశ్వర్ రెడ్డికి ఇచ్చినట్లే పాయల్ శంకర్ కు అవకాశమివ్వొచ్చుకదా? అంటూ లాజిక్ లేవనెత్తుతున్నారు. తాజాగా రాష్ట్ర అధ్యక్షుని ఎంపికలో కూడా బీసీలకు ఛాన్స్ ఇవ్వలేదనే చర్చ ఊపందుకున్నది. బీసీ సంఘం నేత ఒకరు మాట్లాడుతూ బీజేపీ అంటే బ్రాహ్మణ బనియా పార్టీ అంటూ విమర్శించారు. ప్రధానిగా బీసీ నేత మోదీకి బీజేపీ మూడు పర్యాయాలు అవకాశం కల్పించిందనీ, పార్టీ కేంద్ర మంత్రివర్గంలో బీసీలకు పెద్ద పీట వేశారని చెప్పుకునే ఆ పార్టీ అధిష్ఠానం తెలంగాణకొచ్చేసరికి బీసీలకు అన్యాయం చేస్తున్నారనే అపవాదును ఎదుర్కొంటోంది. రాష్ట్ర అధ్యక్షునిగా కిషన్ రెడ్డి కంటే ముందు కరీంనగర్ ఎంపీగా గెలిచిన బీసీ నాయకుడు బండి సంజయ్ కు అవకాశం కల్పించారు. ఎన్నికలకు ముందు సంజయ్ ను తప్పించి కేంద్రమంత్రిగా ఉన్నకిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. తాజాగా బీసీకి కాకుండా అగ్రకులానికి చెందిన వ్యక్తికి బాధ్యతలు అప్పగించడమంటే బీసీల చెవిలో బీజేపీ పువ్వు పెడుతోం దంటున్నారు. ఎన్నికలొస్తే ఓట్ల కోసం మాత్రమే బీసీలు కావాలనీ, పదవులకు బీసీలకు అర్హులు కాదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఈ పరిణామం బీజేపీపై ప్రభావం కనబరస్తుందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

## జగన్‌కు వస్తున్నా ఆదరణతో బాబుకు భయం

నెల్లూరు, వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి కు వస్తున్న ఆదరణ చూసి ఎపి సిఎం చంద్రబాబు నాయుడుకు భయం పట్టుకుందని వైసిపి మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తెలిపారు. చంద్రబాబుపై నెల్లూరులో నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సొంత మామపై చెప్పులు వేయించిన వ్యక్తి చంద్రబాబు అని వెన్నుపోటు పొడిచి టిడిపిని లాక్కున్న దుర్మార్గుడు అని ధ్వజమెత్తారు. జగన్ హయాంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సభలను ఎవరైనా అడ్డుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఎన్ని ఆంక్షలు పెట్టినా సింహం రావడం పక్కా అని అన్నారు. సింహపురి సింహాల (ఒతినీనిబ ఃూతిపఠజూబీసతి) ముందు చంద్రబాబు కుట్రలు సాగవు అని ఎపి ప్రభుత్వం ఆంక్షలే బాబు పతనానికి సంకేతాలు కాబోతున్నాయని నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# మోదీ చుట్టూ అసంతృప్తి వాతావరణం.. పట్టి చూపుతున్న ఐదు కీలక అంశాలు

న్యూఢిల్లీ,దశాబ్దంపాటు ఎదురులేని మొనగాడిలా ప్రపంచం ముందు తిరిగిన ప్రధాని మోదీకి మూడో విడుత పాలనలో వాతావరణం అంత సానుకూలంగా ఉన్నట్టు కనిపించడం లేదు. పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ అనంతర పరిణామాలు మొదలుకుని.. దేశంలో దిగజారుతున్న పారిశ్రామిక వృద్ధి వరకూ.. ఐదు అంశాల్లో మోదీ పాలన వైఫల్యాలు, అసంతృప్త వాతావరణం కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

### సైనిక సాహసం అనంతర చేదు ఫలితం

ఆపరేషన్ సిందూర్ సమయంలో యావత్ దేశం ఊగిపోయింది. ఆక్రమిత కశ్మీర్‌తోపాటు, పాకిస్తాన్ భూభాగంపై ఉన్న ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేస్తే సెభాష్ అంది. అయితే.. ఆ నాలుగు రోజుల ఘర్షణలో ఏం జరిగిందనేది ఇంకా స్పష్టంగా ఎవరూ చెప్పలేదు. ఉగ్రమూకలను అంతమొందించామని చెప్పినా.. భారత్‌కు ఏమైనా నష్టం వాటిల్లిందా? అన్నవి ప్రజలకూ చెప్పలేదు.. పార్లమెంటుకూ చెప్పలేదు. మొట్టమొదటిసారిగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ ప్రాథమికంగా కొన్ని నష్టాలు సంభవించాయని అంగీకరించారు. అదికూడా విదేశీ గడ్డపై మాట్లాడుతూ. ఆ తర్వాత జట్ విమానాలను కోల్పోయామని అంగీకరించారు. ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు ఇస్తున్న అంశాన్ని ప్రపంచానికి చాటేందుకు ప్రతిపక్ష పార్టీల సభ్యులను కలుపుకొని బృందాలను వివిధ దేశాలకు పంపారు. కానీ.. దానికి అంత సానుకూల స్పందన వచ్చినట్టు కనిపించలేదు. పైగా.. పుండు మీద కారం చల్లినట్టు.. భారత దళాలు ధ్వంసం చేసిన ఉగ్రవాద శిబిరాలను పునర్నిర్మిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.

### కీలక అంశాల్లో పాకిస్తాన్ చర్యలు

ఒకవైపు పొరుగుదేశంతో భీకర కాల్పులు జరుగుతున్న సమయంలోనే అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) నుంచి పాకిస్తాణ్ భారీ రుణాన్ని తెచ్చేసుకున్నది. 1958 తర్వాత పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ నుంచి లభించిన 24వ రుణం ఇది. ఐఎంఎఫ్ బోర్డ్‌లో 25 దేశాల సభ్యులు ఉన్నారు. మన దేశ ఓటింగ్ విలువ కేవలం 2.6 శాతం. ఓటింగ్ బదులు ఏకాభిప్రాయానికే అవకాశం ఇచ్చే ఐఎంఎఫ్.. ఒకవైపు పాకిస్తాన్‌కు భారీ రుణం ఇస్తుంటే.. భారత్ మౌన ముద్ర దాల్చి.. బాయ్‌కాట్ చేయడం మినహా ఏమీ చేయలేక పోయింది. జూలై నెలకు గాను పాకిస్తాన్.. ఐక్య రాజ్య సమితి భాద్రతా మండలి నాన్ పర్మినెంట్ మెంబర్‌గా అధ్యక్ష పదవిని చేపట్టనున్నది. భద్రతా మండలికి చెందిన తాలిబన్ ఆంక్షల కమిటీకి అధ్యక్ష పదవికి ఎంపికైంది. అంతేకాదు.. 15 సభ్యదేశాలు ఉన్న ఉగ్రవాద వ్యతిరేక కమిటీకి వైస్ చైర్మన్‌గా వ్యవహరించనున్నది. అంతేకాదు.. భారతదేశపు దీర్ఘకాలిక మిత్రదేశమైన రష్యా నుంచి.. సోవియట్ కాలం నాటి పాత స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నది.భారత మద్దతు గతంలో సార్క్ అనే సంస్థ పనిచేసేది. దక్షిణ ఆసియా సహకార సంఘం. ఇప్పుడు అది పనిచేయడం లేదు. దానిని చైనా మద్దతుతో పునరుద్ధరించే పనిలో పాకిస్తాన్ ఉన్నది. ఈ విషయంలో ఇప్పటికే చైనాలోని కున్మింగ్‌లో నిర్వహించిన సమావేశంలో చర్చలు కూడా సాగాయి. ఈ సమావేశంలో భారతదేశ మాజీ మిత్ర దేశం బంగ్లాదేశ్ కూడా పాల్గొన్నది. ఉన్నట్టుండి ఒక్కసారిగా పాకిస్తాన్ ప్రపంచ స్థాయిలో గౌరవ మర్యాదలు పొందుతున్నది.

### పాకిస్తాన్ జనరల్‌కు ఎక్కడలేని మర్యాదలు



అనేక ఏళ్లపాటు ఇప్పటి పాకిస్తాన్ సైనిక జనరల్ అసిమ్ మునీర్ బయటకు పెద్దగా కనిపించేవాడు కాదు. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ వింగ్ ఐఎస్ఐ చీఫ్‌గా పనిచేసిన ఆయన తర్వాత ఆర్మీ చీఫ్ అయ్యారు. ఇండియా, పాకిస్తాన్ ఘర్షణ తర్వాత ఆయనకు ఎక్కడ లేని హోదా వచ్చేసింది. ఏకంగా వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి విందుకు హాజరయ్యేంత పలుకుబడి వచ్చింది. జనరల్ పర్వేజ్ ముషరఫ్ 2001లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్‌ను కలిసిన తర్వాత.. 24 ఏళ్లుగా ఏ పాకిస్తానీ జనరల్ కూడా వైట్‌హౌస్‌లో అడుగు పెట్టలేదు. నిజానికి ముషరఫ్ కూడా నాటి పాకిస్తాన్ అధ్యక్షుడి హోదాలోనే వెళ్లారు. ప్రపంచ రాజకీయాల్లో పాకిస్తాన్ తన జోక్యాన్ని పెంచుకుంటున్న క్రమంలోనే మునీర్ సైతం అమెరికా ఆతిథ్యం పొందారు. ఇది భారత ప్రభుత్వానికి రుచించేది కాదు.

### షాంఘైలో అవమానం

షాంఘైలో ఇటీవల షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సమావేశం నిర్వహించారు. అందులో సభ్య దేశాల రక్షణ మంత్రులు ఆ సమావేశానికి హాజరయ్యారు. అయితే.. ఆ సమావేశం ముసాయిదాపై సంతకం చేసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తిరస్కరించారు. ఆ ముసాయిదాలో అత్యంత భయానకమైన పహల్గామ్ దాడిని ప్రస్తావించలేదు కానీ.. మార్చి నెలలో బలూచిస్తాన్‌లో రైలుపై దాడి ఘటనను ప్రస్తావించారు.

### తొమ్మిది నెలల కనిష్ఠానికి పారిశ్రామిక వృద్ధి

నెల రోజుల క్రితం నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణియన్ ఒక ప్రకటన చేస్తూ జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని గొప్పగా ప్రకటించారు. అక్కడితో ఆగలేదు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి జర్మనీని కూడా దాటేస్తామని చెప్పారు. తీరా చూస్తే.. భారతదేశపు పారిశ్రామిక ఉత్పత్తి సోమవారం (30 జూన్ 2025) నాటి లెక్కల ప్రకారం 1.2 శాతంగా నమోదైంది. అంటే.. అది తొమ్మిది నెలల కనిష్ఠం. మైనింగ్, పవర్ సెక్టర్‌లలో సంకోచాలు ఇందుకు కారణంగా నిపుణులు చెబుతున్నారు. కనిష్ఠ పారిశ్రామికోత్పత్తి ద్వారా గ్రామీణ వినియోగం బలహీనపడితే.. ఎఫ్ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్)తోపాటు.. చిన్న తరహా పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. పారిశ్రామికవేత్తలతో ఆంతరంగికంగా మాట్లాడితే.. దేశ ఆర్థిక పరిస్థితి సరిగా లేదని చెబుతున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## కెసిఆర్ హయాంలోనే బనకచర్లకు శ్రీకారం

హైదరాబాద్, ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం – బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పోలవరం–బనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. ఏపీ ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిందన్నారు.

## నటి వాసుకికి పవన్ సాయం

అమరావతి,డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ మరోమారు పెద్ద మనసు చాటుకున్నారు. 'పాకీజా'గా తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పంచిన నటి వాసుకికి ఆర్థిక సాయం అందించారు. సొంతంగా 2లక్షలను అందించారు. ఒకప్పుడు తెలుగులో వైవిధ్యమైన పాత్రలతో అలరించిన ఆమె ప్రస్తుతం ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆమె విడుదల చేసిన వీడియో చూసి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. పాకీజా దీనస్థితి ఆయన దృష్టికి రావడంతో మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయానికి పిలిపించి రూ.2లక్షలు తక్షణ ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పి. హరిప్రసాద్, పి.గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ వాసుకికీ అందజేశారు. తన దుస్థితి తెలిసి ఆర్థికసాయం చేసిన పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞత చెబుతూ, ఆమె భావోద్వేగానికి గురయ్యారు.ఇటీవల వాసుకి ఓ వీడియోను విడుదల చేశారు. తాను పూట గడవక దీనస్థితిలో ఉన్నట్లు అందులో తెలిపారు. 'నేను హాస్య నటి పాకీజా. ఏపీ సీఎం, డిప్యూటీ సీఎంలకు నా నమస్కారాలు. నేను చాలా కష్టాల్లో ఉన్నా. మూడేళ్లుగా షూటింగ్స్ లేక ఇబ్బంది పడుతున్నా. ఇండస్ట్రీలో అవకాశాలు లేకపోవడంతో నా సొంత ఊరు కారైకుడికి వచ్చేశా. ఏదైనా సాయం చేస్తారేమోనని సీఎంను కలవడానికి నేను రెండుసార్లు విజయవాడ వచ్చా. కానీ, కలవడం చాలా కష్టమైంది. ఆ తర్వాత డిప్యూటీ సీఎంను కలవాలని ప్రయత్నించినా కలవలేకపోయానని పేర్కొంది. తమిళనాడులో నాకు ఆధార్ ఉంది. దీని ఆధారంగా ఏపీలో నెల నెలా పెన్షన్ వచ్చేట్లు ఏదైనా సాయం చేయండి. మీ కాళ్లు పట్టుకుని వేడుకుంటాను. భర్త, పిల్లలు ఎవరూ లేరు. అనాథగా ఉంటున్నా. గతంలో చిరంజీవి గారు, నాగబాబు గారు సాయం చేశారు. ఇప్పుడు ఏపీ సీఎం చంద్రబాబు గారు, పవన్ గారు దయచేసి నన్ను ఆదుకోవాలి. నాకు కనీసం పెన్షన్ అందేలా చేయండి' అని వాసుకి కోరారు. ఆమె మాటలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన తక్షణం రూ.2లక్షలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం వాసుకి మాట్లాడుతూ.. 'తమిళనాడులో ఎవరూ నన్ను పట్టించుకోలేదు. తమ్ముడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు నా స్థితి గురించి చెప్పగానే రూ.2లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఆయనది గొప్ప మనసు. చిరంజీవి అన్నయ్య, నాగబాబు అన్నయ్య సహా మెగా కుటుంబం చాలాసార్లు నన్ను ఆదుకుంది. వదినమ్మ ఇచ్చిన చీరలు కట్టుకుని బతుకుతున్నా. ఇప్పుడు ఆర్థికసాయం చేసి, 'మేమున్నాం' అన్నారు. చాలా సంతోషంగా ఉందని అన్నారు.

## వాల్మీకి కార్పోరేషన్‌లో కర్నాటకకు చుక్కెదురు

బెంగళూరు,ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సారథ్యంలోని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి వాల్మీకి ఎస్టీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు కర్ణాటక హైకోర్టు మంగళవారంనాడు ఆదేశించింది. దీంతో ఇంతవరకూ ఈ కుంభకోణానికి సంబంధించిన నిర్దిష్ట అవకతవకలపై దర్యాప్తునకే పరిమితమైన సీబీఐ ఇకనుంచి మొత్తం కేసులో పూర్తి స్థాయి విచారణ చేపడుతుంది. ఈ కేసులో ఇంతవరకూ జరిగిన విచారణ నివేదకలను సీబీఐకి అప్పగించాలని కూడా హైకోర్టు ఈ సందర్భంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను అదేశించింది. బీజేపీ నేతలు బసనగౌడ పాటిల్ యత్నాల్, అరవింద్ లింబావలి తదితరులు వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న సారథ్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. వాల్మీకి స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గత జూన్‌లో బళ్లారికి చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇ.తుకారాం, ముగ్గురు కర్ణాటక ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు జరిపింది. గిరిజన సంక్షేమానికి ఉద్దేశించిన కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని, అక్రమంగా కార్పొరేషన్ అకౌంట్లలోని నిధులను తప్పుడు బ్యాంకు అకౌంట్లలోకి బదిలీ చేశారని ఈ కేసులో ప్రధాన ఆరోపణగా ఉంది. షెల్ కంపెనీలకు తరలించిన నిధులను 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బళ్లారి నియోజకవర్గంలో వినియోగించినట్టు ఈడీ చెబుతోంది. రాష్ట్రంలోని ఎస్టీల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా నిర్దిష్ట సంక్షేమ పథకాల అమలుకు 2006లో కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటయింది. 2024 మే 21న వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో నిధుల దుర్వినియోగం విషయం వెలుగుచూసింది. కార్పొరేషన్ నుంచి అక్రమంగా వివిధ బ్యాంక్ అకౌంట్లకు నిధులు బదిలీ అయినట్టు ఆ అధికారి రాసిన సూసైడ్ నోట్‌ను అధికారులు ఆ తర్వాత కనుగొన్నారు.

# రేవంత్ వాటర్ ఎటాక్ - బీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి !



హైదరాబాద్,బనకచర్ల వివాదంతో ఏపీపై, చంద్రబాబుపై విషం చిమ్మి.. తెలంగాణ ప్రజల మనసుల్లో మళ్లీ విద్వేష బీజాలు నాటి.. బీఆర్ఎస్ పార్టీకి ఊపిరి పోసుకుందామని గట్టి ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి రేవంత్ రెడ్డి గట్టి కౌంటర్ ఎటాక్ ఇస్తున్నారు. మంచి ఒరేటర్ అయిన రేవంత్ రెడ్డి ఈ విషయంలో తెలంగాణ ప్రజల ముందు కీలక విషయాలు ఉంచుతున్నారు. తప్పు ఎవరిదో స్పష్టంగా ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. అదే సమయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడుకుంటామన్న గట్టి సందేశం ఇస్తున్నారు.

కేసీఆర్, హరీష్ సంతకాల వల్లే తెలంగాణకు అన్యాయం

రాష్ట్రం విడిపోయిన తర్వాత కృష్ణ జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కేసీఆర్ , హరీష్ రావు సంతకాలు చేశారని.. ఇదే తెలంగాణకు మరణశాసనం అయిందని రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. ఇది రికార్డెడ్ అంశం. ఈ అంశంలో బీఆర్ఎస్ పార్టీ సమాధానం చెప్పలేకపోతోంది. అబద్దాలు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తోంది. కానీ నిజం ఏమిటో చెప్పడం లేదు. కృష్ణా నదిలోని మొత్తం 811 టీఎంసీ నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీ, తెలంగాణకు 299 టీఎంసీ కేటాయించారు. 1976లో బచావత్ ట్రిబ్యునల్ల్ ద్వారా ఏకీకృత ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీ నీటి ఆధారంగా జరిగింది.

తాత్కాలికం అని ఇప్పుడు వాదిస్తున్న కేసీఆర్,హరీష్

కేసీఆర్ ప్రభుత్వం ఈ ఒప్పందం చేసుకుని ఇప్పుడు తాత్కలికంగానే చేసుకున్నామని సమర్థించుకుంటోంది. 299 టీఎంసీ కేటాయింపును తాత్కాలికమైనదిగా భావిస్తూ, కృష్ణా నది బేసిన్‌లో 68.5 శాతం క్యాచ్‌మెంట్ ప్రాంతం తెలంగాణలో ఉన్నందున, సుమారు 555 టీఎంసీ నీటిని కేటాయించాలని ప్రజలు ఇలా ఎలా ఒప్పందం చేసుకున్నారని ప్రశ్నించే సమయంలో వాదనను బయటకు తీసుకు వచ్చారు. అసలు అన్యాయం చేసిన వాళ్లే ఇప్పుడు మళ్లీ జల వివాదాలతో రాజకీయం చేయడం ఏమిటన్న ప్రశ్నను రేవంత్ రెడ్డి తీసుకు వస్తున్నారు.

గోదావరిలోనూ కేసీఆర్ నిర్లక్ష్యమే !

అటు కృష్ణా జలాల్లో జరిగిన అన్యాయం అయినా.. ఇటు గోదావరి నీటిని ఏపీ బనకచర్ల ద్వారా తరలించుకుందామన్న ప్రయత్నం చేసినా అదంతా కేసీఆర్ వల్లే జరుగుతోందని రేవంత్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.కేసీఆర్ గతంలో రోజా ఇంటికి వెళ్లి రాయలసీమను రతనాల సీమ చేస్తామన్నారు. గోదావరి నీటిని రాయలసీమ తరలించేందుకు సహకరిస్తామన్నారు. ఇప్పుడు అదే కేసీఆర్, హరీష్ రావు.. అడ్డగోలు రాజకీయం చేస్తున్నారు. ఇలాంటి వాటిని రేవంత్ పక్కాగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ .. అవసరం లేని అంశాలతో ఎదురుదాడి చేస్తోంది కానీ.. ప్రజలు సూటిగా.. సుత్తిలేకుండా.. గతంలో చేసిన పనులకు వివరణ అడుగుతున్నారు. బీఆర్ఎస్ వాటికి సమాధానం చెప్పాల్సిన ఉంది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. రేసులో మేయర్ విజయలక్ష్మి?

హైదరాబాద్: ఇటీవల కాలంలో జీహెచ్ఎంసీలోని కార్పొరేటర్ల హడావుడి పెరిగింది. అన్ని కార్యక్రమాల్లోనూ తామున్నామంటూ ముందుకొస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమంటూ సర్కిల్, జోనల్ అధికారులతో పాటు ప్రధాన కార్యాలయంలోని కమిషనర్‌ను, ఉన్నతాధికారులను కలుస్తున్నారు. తమ పరిధిలోని అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్నారు. త్వరితంగా చేయాల్సిందిగా తొందర పెడుతున్నారు. అంతే కాదు.. స్థానిక సమస్యలపైనా పాలకమండలి సమావేశాల్లో గళమెత్తుతున్నారు. అవినీతి, అక్రమాలు, అవకతవకలపై ప్రశ్నలతో అధికారులను ఇరుకున పెడుతున్నారు. బోగస్ బర్త్, డెత్ సర్టిఫికెట్ నుంచి మొదలు పెడితే, వివిధ అంశాల్లో అవినీతిపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. వేయని రోడ్లకు బిల్లులు కాజేస్తున్నారంటూ ఇంజినీర్ల అక్రమాలను కళ్లకు కడుతున్నారు.

నాలుగేళ్ల పాటు లేనిది..

గడచిన నాలుగేళ్లుగా లేని చైతన్యం ఇప్పుడే ఎందుకొచ్చింది అనే ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి. త్వరలోనే వారి పదవీకాలం ముగియనుండటం అందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత పాలక మండలికి దాదాపు ఏడు నెలల సమయం మాత్రమే ఉంది. తిరిగి గెలవాలంటే ప్రజల్లోకి వెళ్లక తప్పదు. తీరా ఎన్నికలు వచ్చాక వెళ్తే ప్రజలు తిరగబడ్తారని, అభాసుపాలవుతారని తెలిసి ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కారమైతే తమకదే పదివేలంటున్నారు ప్రజలు. ఇది అందరి కార్పొరేటర్ల పరిస్థితి కాగా, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కార్పొరేటర్ల పరిస్థితి ఇంకొంచెం భిన్నంగా ఉంది. అందుకు కారణం త్వరలో జూబ్లీహిల్స్ అసెంబ్లీకి ఉప ఎన్నిక జరగనుండటమేనని చెబుతున్నారు.

'జూబ్లీహిల్స్'పై కన్ను..



ఆ నియోజకవర్గాల్లోని కార్పొరేటర్లతో పాటు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు సోమవారం ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. జూబ్లీహిల్స్ పరిధిలోనే ఉన్న యూసుఫ్‌గూడ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌తో పాటు రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజల ఫిర్యాదులు ఓపికగా విన్నారు. జాప్యం లేకుండా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇదివరకు లేని విధంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎక్కువసేపు ఉంటున్నారు. మే యర్ ఖైరతాబాద్ నియోజకవర్గం లో ఉన్నప్పటికీ జూబ్లీహిల్స్ కూడా పొరుగునే ఉండటాన్ని ఈ సందర్భంగా పలువురు ప్రస్తావిస్తున్నారు. రాబో యే ఎన్నికల్లో తాను మళ్లీ కార్పొరేటర్‌గా పోటీ చేయనని ఇదివరకే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న జూబ్లీహిల్స్ అసెంబ్లీపై ఆమె చూపు ఉందేమో అనే వ్యాఖ్యానాలు సైతం వినిపిస్తున్నాయి.

# సీఎం సంచలన నిర్ణయం.. సీబీఐకి అప్పగింత..

చెన్నై:తమిళనాడు రాష్ట్రం శివగంగై జిల్లాలో అజిత్ కుమార్ కస్టోడియల్ డెత్ కేసు విషయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసుని కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు. పారదర్శకంగా, విశ్వసనీయంగా దర్యాప్తు జరిగేలా చూసేందుకే తానీ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.ప్రస్తుతం జరుగుతున్న CB-CID దర్యాప్తు కొనసాగించవచ్చని మద్రాస్ హైకోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని తమిళనాడు ముఖ్యమంత్రి MK స్టాలిన్ అన్నారు. CBI విచారణ మరింత స్పష్టతను ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. “పారదర్శకత, సమగ్ర దర్యాప్తు కోసం కేసును CBIకి బదిలీ చేయాలని ఆదేశించాను” అని స్టాలిన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సంస్థకు పూర్తిగా సహకరిస్తుందని ఆయన వెల్లడించారు.స్టాలిన్ స్వయంగా అజిత్ కుమార్ కుటుంబంతో మాట్లాడారు. అజిత్ సోదరుడు నవీన్ కుమార్‌కు ఫోన్ చేశారు. పోలీస్ కస్టడీలో అజిత్ మరణించడం పట్ల స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. అజిత్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు ఎటువంటి సాయం కావాలన్నా చేస్తానని చెప్పారు. “క్షమించండి అమ్మా,” అని అజిత్ తల్లి మాలతికి తన సంతాపాన్ని తెలియజేశారు ముఖ్యమంత్రి స్టాలిన్.మృతుడు అజిత్ కుమార్(27) మాదపురం కాళీఅమ్మన్ ఆలయంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తాడు. ఆ ఆలయంలోని ఆభరణాల దొంగతనం కేసులో ప్రశ్నించేందుకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అజిత్ చనిపోయాడు. అజిత్ మృతికి పోలీసులే కారణం అని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. విచారణ పేరుతో అజిత్ ను చిత్రహింసలు పెట్టారని, బాగా కొట్టారని, దాంతో అజిత్ చనిపోయాడని కన్నీటిపర్యంతం అయ్యారు. కనీసం తాగడానికి నీరు కూడా ఇవ్వలేదని విలపించారు. అజిత్ పై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, వారి దెబ్బలు తాళలేకనే అజిత్ చనిపోయాడని కుటుంబసభ్యులు ఆరోపించారు.అజిత్ కస్టోడియల్ డెత్ కేసు సంచలనం రేపింది. విచారణ పేరుతో అజిత్ ను పోలీసులు కర్రలు, రాడ్లతో దారుణంగా కొడుతున్న వీడియో బయటకు రావడం, సోషల్ మీడియాలో వైరల్ కావడం పెను దుమారమే రేపింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో తమిళనాడు ప్రభుత్వం సీరియస్ అయ్యింది. శివగంగై ఎస్పీపై చర్యలు తీసుకుంది. బాధ్యతల నుంచి



తప్పించింది. రామంతపురం ఎస్పీకి అదనపు బాధ్యతలు అప్పగించింది. కస్టోడియల్ డెత్ పై ప్రభుత్వం తొలుత సీబీ-సీఐడీ విచారణకు ఆదేశించింది. కస్టోడియల్ డెత్ కేసుకు సంబంధించి మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్‌లో దాఖలైన పిటిషన్ పై విచారణ సందర్భంగా, న్యాయవాది హెన్రీ టిఫాగ్నే అజిత్ కుమార్‌ను ప్లాస్టిక్ పైపులు, ఇనుప రాడ్‌లతో కొట్టారని చూపించే వీడియో, ఫోటోగ్రాఫిక్ ఆధారాలను సమర్పించారు.కస్టోడియల్ డెత్ కేసులో ఐదుగురు పోలీసులు అరెస్ట్ అయ్యారు. పోస్టుమార్టం ఆధారంగా ఆరుగురు పోలీసు అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. కేసుని క్రిమినల్ కేసుగా మార్చారు. ఈ కేసు న్యాయ విచారణ కోసం పంపబడింది.పోస్టుమార్టం రిపోర్టులో షాకింగ్ విషయాలు తెలిశాయి. అజిత్ తల, ఛాతిపై అనేక చోట్ల గాయాలు ఉన్నట్లు రిపోర్టులో ఉంది. అజిత్ కస్టోడియల్ మరణం అట్టుడికేలా చేసింది. కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు న్యాయం కోసం రోడ్డెక్కారు. అజిత్ మృతికి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ కేసుకి సంబంధించి మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పోలీసుల వైఖరిపై తీవ్రంగా మండిపడింది. మీ ప్రజలను మీరే చంపుకుంటారా అని సీరియస్ అయ్యింది. దీనిపై అదనపు జిల్లా జడ్జితో విచారణ జరిపించాలని, జూలై 8కి నివేదిక సమర్పించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. అలాగే ప్రత్యక్ష సాక్షికి రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశించింది.

# రేణుకను ఆపేవాళ్లు ఎవరూ లేరా?



హైదరాబాద్,రాజకీయాలలో మార్మికతకు ప్రాధాన్యం ఉంటుంది. ఎందుకంటే కొన్ని విషయాలను నేతలు అంతర్గతంగానే సంభాషించడానికి ఇష్టపడుతుంటారు. ఇలాంటి వేదికలైనా సరే కొన్ని కొన్ని విషయాలలో అలా వరకు గోప్యత పాటిస్తూ ఉంటారు. దాపరికాన్ని పాటించడం వల్ల రాజకీయాలలో కొన్ని విలువలను కాపాడుకుంటారు. అయితే కొంతమంది నాయకులకు అలాంటిది ఉండదు. వేదిక ఏదైనా సరే.. ఎక్కడైనా సరే మొహమాటం లేకుండా ఉన్న విషయాన్ని చెప్పేస్తుంటారు. ఆ తర్వాత పరిణామాలు ఎలా ఉన్నా సరే వాళ్ళు స్వీకరించగలుగుతారు. ఈ జాబితాలో రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుక చౌదరి మందు వరుసలో ఉంటారు. ఏ విషయాన్ని ఆమె మనసులో దాచుకోరు. పైగా ఎవరేమనుకున్నా పర్వాలేదు.. నా దారి నాదే అన్నట్టుగా ఆమె నడుచుకుంటారు.. కీలక వ్యాఖ్యలే కాదు సంచలన వ్యాఖ్య కూడా చేసి ఆమె మీడియాలో తెగ ప్రచారంలో ఉంటారు.తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఫైర్ బ్రాండ్ లీడర్లలో రేణుకా చౌదరి ఒకరు. గతంలో ఈమె ఖమ్మం పార్లమెంటు స్థానం నుంచి విజయం సాధించారు. కేంద్ర మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈమె చక్రం తిప్పారు. సోనియాగాంధీకి అత్యంత సన్నిహితురాలుగా ఉన్నారు. రాహుల్ గాంధీకి కూడా దగ్గర వ్యక్తిగా ముద్రపడ్డారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల తరువాత రేణుకా చౌదరి ప్రాధాన్యం కాంగ్రెస్ పార్టీలో తగ్గిపోయింది. ప్రస్తుతం ఆమె ఖమ్మం జిల్లాకు మాత్రమే పరిమితమయ్యారు. రేణుక చౌదరి ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. రేణుక చౌదరి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో అనర్గళంగా మాట్లాడతారు. ఏ విషయమైనా సరే కుండ బద్దలు కొట్టినట్టు చెబుతుంటారు. ఇటీవల ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మీద ఓ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఓపెన్ గానే మాట్లాడేశారు. ఏమాత్రం ఇబ్బంది పడకుండా తాను ఏమనుకుంటున్నానో.. అదే విషయాన్ని చెప్పేశారు.. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఏపీ సర్వనాశనం అయిందని.. అసాంఘిక శక్తులు పేట్రేగిపోయాయని రేణుక ఆరోపించారు. జగన్ నిర్వాకం వల్ల అమరావతి రాజధాని ఆగమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.రేణుక ఒక సామాజిక వర్గానికి చెందిన మహిళ కాబట్టిప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉన్నాడు కాబట్టి అలా వెనకేసుకొని వచ్చిందని అందరూ అనుకున్నారు. కానీ వారందరి అంచనాలను రేణుక చౌదరి తలకిందులు చేశారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం పనితీరు అంత గొప్పగా లేదని.. ఊహించిన మాదిరిగా చంద్రబాబు ప్రభుత్వం పనిచేయడం లేదని రేణుక అన్నారు. ఆల్రెడీ చంద్రబాబు ప్రభుత్వం పనితీరు డౌన్ లో ఉందని వ్యాఖ్యానించారు.. రేణుక చేసిన వ్యాఖ్యలను వైసీపీ సోషల్ మీడియా విభాగం వారు విపరీతంగా స్ప్రెడ్ చేస్తున్నారు.. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం పని అయిపోయిందని.. చంద్రబాబు నాయుడు సొంత సామాజిక వర్గాన్ని చెందిన కీలక నాయకురాలే ఈ మాట మాట్లాడుతున్నారని.. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ అధికారంలోకి వస్తుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

# రాజాసింగ్ ఎపిసోడ్ చెబుతున్నదిదేనా?



హైదరాబాద్,గంగ పూర్తిగా చంద్రముఖిగా మారిందని ఒక సినిమా డైలాగ్. తెలంగాణ బీజేపీ కూడా అలా కాషాయీకరణ నుంచి కిషన్ రెడ్డీకరణ చెందినట్టేనా? ఆయన్ను వ్యతిరేకించిన వారు, ఆయన గుట్టు రట్టు చేసిన వారి జాడే లేకుండా పోతుందా? అన్న చర్చకు తెరలేచింది. ఇప్పుడందరి మాట ఏంటంటే గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా ఆయనకేం పెద్దగా నష్టం కలిగించదు. ఎందుకంటే ఆయన ఇప్పుడు ఆ నియోజకవర్గంలో బీజేపీని మించి పోయారు. బీజేపీ హవా లేకున్నా గెలుస్తారు. ఉన్నా గెలుస్తారు. ఆయన ఇండిపెండెంట్ గా గెలుస్తారు. పార్టీ టికెట్ మీదా గెలుస్తారు. ఇప్పుడాయన రెండు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అవసరం లేని హిందుత్వ బ్రాండ్ గా రూపాంతరం చెందారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు సమస్య అంతా ఏంటంటే రాజా సింగ్ తెలంగాణ బీజేపీకి ఒరిజినల్ సీడ్. కిషన్ రెడ్డయినా అంబర్ పేట్ లో ఓడిపోతారేమోగానీ.. ఆయన మాత్రం తన సెగ్మెంట్లో అస్సలు ఓడరు. అంతటి సాలిడ్ ఓటు బ్యాంకు రాజాసింగ్ సొంతం. అలాంటి రాజాసింగ్ అంటే సిసలైన కాషాయ సైనికుడు. బీజేపీ దాని పొలిటికల్ డైనమిక్స్ ని ఆయన ఎప్పుడో దాటి పోయారన్న పేరుంది. ఒక రకంగా చెబితే బీజేపీలో మరే సాధారణ నేత కూడా కామెంట్ చేయలేని ఎన్నో అంశాలపై ఆయన సంచలన కామెంట్లు చేసి సస్పెండ్ అయిన పరిస్థితులున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఓల్డ్ సిటీలో ఎంఐఎంని ఢీ కొట్టగలిగే వారే లేరు. కానీ ఎంఐఎంని దాని విధానాలను తూర్పార పట్టగల ఒకే ఒక్కడుగా రాజాసింగ్ తనదైన గుర్తింపు పొందారు.అలాంటి రాజాసింగ్ లేని బీజేపీ నేతి బీరకాయలో నెయ్యి అన్న చందంగా కాషాయంలేని కాషాయ పార్టీగా బీజేపీ మిగిలిపోతుందని అంటున్నారు. ఇప్పుడు అక్కడున్న ఎమ్మెల్యే, ఎంపీల్లోనూ చాలా మందిది బేసిగ్గా ఈ పార్టీ కానే కాదు. హిందుత్వ భావజాలం అసలే లేదు. మరీ ముఖ్యంగా ఈటల, డీకే అరుణ, కొండా విశ్వేశ్వరరెడ్డి వంటి వారు వేరే వేరే పార్టీల నుంచి కమలం గూటికి చేరారు. మరీ ముఖ్యంగా ఈటల విషయమే తీసుకుంటే ఆయన వామపక్ష సానుభూతి పరుడిగా గుర్తింపు పొందారు. ఇప్పుడు బీజేపీ శ్రేణులే ఆయనను బీఆర్ఎస్ కోవర్టుగా అభివర్ణిస్తున్నారు. కాళేశ్వరం అంశంలో బీఆర్ఎస్ ఇంతగా విచారణ ఎదుర్కుంటుండగా.. ఆయన కూడా హాజరైన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ కు కేసీఆర్ కు అనుకూలంగా మాట్లాడారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే.. ప్రస్తుతం బీజేపీలో ఉన్న వారిలో చాలా మంది మూలాలు ఆర్ఎస్ఎస్ భావజాలం కాదు. కేవలం రాజకీయ అనివార్యత వల్లనే కమలం గూటికి చేరిన వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. అలాంటి పార్టీలో ద ఒరిజినల్ కాషాయ రక్తం బయటకు వెళ్లడం అంటే ఆ పార్టీ మూల సిద్ధాంతం మరుగున పడ్డ పరిస్థితులున్నట్టుగానే భావించాలని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.దీనంతటి వెనక కిషన్ రెడ్డి ఉన్నట్టుగా పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. బేసిగ్గా కిషన్ రెడ్డి గురించి రాజా సింగ్ గతంలో అధికారంలో ఎవరుంటే వారితో కిషన్ చెట్టాపట్టాలేసుకుని తిరుగుతారని.. ఉగ్రవాదం మీద పోరు చేస్తూనే ఉగ్రవాదులతో కలసి వ్యాపారాలు చేసే అమెరికన్ ప్రెసిడెంట్లకన్నా పెద్ద ప్రమాదకారి అనీ ఆరోపణలు, విమర్శలూ చేసిన సంగతి తెలిసిందే. అలాంటి కిషన్ రెడ్డి ఆడమన్నట్లు పార్టీ అధిష్టానం ఆడుతోందనీ.. కారణం ఆయన కేంద్ర అధిష్టాన పెద్దలకు అత్యంత దగ్గరి వాడు కావడమేననీ, అందుకనే సాధారణ కార్యకర్తకు పార్టీలో చోటు దక్కకుండా పోతోందనీ.. తెలంగాణలో ప్రస్తుత ఇది ఒకప్పటి కాషాయ పార్టీ కాదని.. పూర్తి కిషన్ మార్క్ కమర్షియల్ వర్షెన్ అని రాజాసింగ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పైకి చెప్పకపోయినా తొలి నుంచీ బీజేపీలో ఉన్నవారు అంతర్గత సంభాషణల్లో రాజాసింగ్ తో ఏకీభవిస్తున్నారు. ఇక రాజాసింగ్ క్రమశిక్షణ గీత దాటారంటూ రాణి రుద్రమ వంటి చోటా మోటా లీడర్ల వివరణలను పార్టీలో పదవుల వెంపర్లాట కొద్దీ చేస్తున్నవిగా కొట్టి పారేస్తున్నారు రాజాసింగ్ మద్దతుదారులు. మొత్తానికి ఈ కాషాయ తగువులాట ఎక్కడి వరకూ వెళ్తుందో చూడాలి.

# ఈ ఒక్క పదవి చాలు...పురంధేశ్వరి కామెంట్స్

అమరావతి,తాను రెండేళ్ళ పాటు ఏపీ బీజేపీ అధ్యక్ష పదవిని పూర్తి చేశాను అని దగ్గుబాటి పురంధేశ్వరి చెప్పారు. తాను రెండేళ్ళ క్రితం అమర్నాథ్ ఆధ్యాత్మిక తీర్థ యాత్రలో ఉన్నపుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తనకు ఫోన్ చేసి ఏపీ బీజేపీ అధ్యక్షురాలిగా ఎన్నిక అయ్యారు అని చెప్పారు అని ఆమె గుర్తు చేసుకున్నారు.ఈ రెండేళ్ళ కాలంలో అందరూ అన్ని విధాలుగా తనకు సహకరించినందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తన ఈ ప్రయాణంలో అందరూ అండగా నిలబడ్డారు అన్నారు. అలా తనను ప్రోత్సహించిన వారికి అలాగే తనను ప్రతిఘటించిన వారికి ధన్యవాదాలు అని ఆమె చెప్పడం విశేషం.ఇక కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలో ఉందని ఈ నేపథ్యంలో మనం వేసే ప్రతె అడుగు మాట్లాడే ప్రతీ మాట ఆచీ తూచీ ఉండాలని ఆమె కొత్త సూచించారు. ఈ సందర్భంగా ఆమె కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా పదవులు ఉంటే రెండేళ్ళు లేదా మూడేళ్ళు ఉంటాయని కానీ ఒక పదవి మాత్రం తన నుంచి ఎవరూ దూరం చేయలేరు అని ఆమె అన్నారు. ఆ పదవి కార్యకర్త అని అని ఆమె చెప్పారు. తాను పదవులు ఎన్ని చేపట్టినా ఒక కార్యకర్తలా మళ్ళీ వారి మధ్యలోనే ఉంటాను అని అన్నారు. తాను కార్యకర్త పదవికే ఇక మీదట న్యాయం చేస్తాను అని ఆమె అనడం విశేషం.మొత్తానికి చూస్తే పురంధేశ్వరి చేసిన ఈ వ్యాఖ్యల మీద చర్చ సాగుతోంది. ఆమెని పిలిచి పదవి ఇచ్చి రెండేళ్ళకే కార్యకర్తగా మార్చేశారని ఆవేదన ఉందా అని అంటున్నారు. అంతే కాదు కేంద్ర మంత్రి పదవి మీద ఆమె ఆశలు పెట్టుకుంటే అది కూడా దక్కలేదు.దాంతోనే ఆమె తన నుంచి కార్యకర్త పదవిని దూరం చేయలేరు అన్న మాటలు వచ్చాయా అని చర్చించుకుంటున్నారు. ఇక తనను పార్టీలో



ప్రతిఘటించిన వారికి ధన్యవాదాలు అని సెటైర్లు వేశారు. ఏపీ బీజేపీలో ఆమెని ప్రతిఘటించిన వారు ఎవరు అన్నది కూడా ఆలోచిస్తున్నారు.ఇదిలా ఉంటే పురంధేశ్వరిది బీజేపీలో 11 ఏళ్ల రాజకీయ ప్రయాణం. ఆమె సాధించింది బీజేపీ ప్రెసిడెంట్ పదవి అలాగే ఒక సారి ఎంపీ అని అంటున్నారు. అధికారిక హోదాలు అయితే ఇప్పటిదాకా ఆమెను వరించలేదు అని గుర్తు చేస్తున్నారు.మరి కేంద్రంలో ఇంకా నాలుగేళ్ళ బీజేపీ ప్రభుత్వం ఉంది కాబట్టి ఆమెకు ఏమైనా మంచి స్థానం ఇస్తారా అన్నది కూడా అంతా చర్చించుకుంటున్నారు. మొత్తానికి కేంద్ర మంత్రిగా పనిచేసి మూడు సార్లు ఎంపీగా నెగ్గిన ఆమె బీజేపీలో ఒక కార్యకర్తను తాను అని అనడం అంటే ఆమె ఏమైనా అసంతృప్తితో ఈ మాటలు అన్నారా లేక మామూలుగానే అన్నారా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు.

# శ్రీవారి ఆలయంపై మరోసారి విమానం చక్కర్లు..



తిరుమల:తిరుమల శ్రీవారి ఆలయంపై మరోసారి విమానం చక్కర్లు కొట్టింది.

ఆగమశాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా ఆలయంపై విమానాలు వెళ్లడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తిరుమల శ్రీవారి ఆలయాన్ని నో ఫ్లైయింగ్ జోన్ ప్రకటించాలని అనేక మార్లు కేంద్రాన్ని కోరారు. కానీ కార్యరూపం దాల్చ లేదు.ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ కూటమే అధికారంలో ఉంది. అయినా కూడా ఆలయంపై నుంచి విమానాలు వెళ్లడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నా.. ఆలయం పైనుంచి విమానాలు ఎలా వెళ్తాయంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. శ్రీవారి ఆలయాన్ని నో ఫ్లైయింగ్ జోన్‌గా తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.టీటీడీకి ఉగ్రవాద ముప్పు పొంచి ఉంది. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత తిరుమలలో సెక్యూరిటీ పెంచారు.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**